**ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు గ్రామీణం, భీమవరం పట్టణం:** అభివృద్ధికి ప్రణాళికలు రచించాల్సిన పురపాలిక అధికారులు కొంత మంది తమ సొంత ప్రయోజనాలకు బాటలు వేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జనన, మరణ ధ్రువీకరణ పత్రం మొదలు మంచినీటి కుళాయిలు, భవనాల అనుమతుల వరకు అన్నింటికి ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. పురపాలికల ఆధ్వర్యంలోని దుకాణాలు, కల్యాణ మండపాలు, మార్కెట్ల అద్దెలు, లీజుల పునరుద్ధరణ, కొత్త కేటాయింపులను... ఆదాయ వనరులుగా మలుచుకుని అవినీతికి పాల్పడుతున్నారు.

# ఆగని ఆరగింపు సేవ

## పురపాలక సంఘాల్లో మారని అధికారుల తీరు



పాలకొల్లు పురపాలికలో గతంలో ఆర్‌ఐగా చేసిన ఓ ఉద్యోగిపై అనేక ఆరోపణలున్నాయి. మార్కెట్ పాటలు నిర్వహించకుండా వైకాపా నాయకుల అండ చూసుకుని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారని కొంత మంది ఉద్యోగులు వాపోతున్నారు. ఆక్రమిత స్థలాలకు సైతం పన్నులు వేయడంతో వాటిపై కొంతమంది కోర్టుకు సైతం వెళ్లారు. ప్రస్తుతం భీమవరం మున్సిపాలిటీకి బదిలీ అయినా తీరు మారలేదని పలువురు అనుకుంటున్నారు.

● భీమవరం మున్సిపాలిటీలో అనుమతులు లేని భవనాలు ఎన్నో ఉన్నా వాటిపై టీపీవోలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పురపాలక అద్దె దుకాణాలకు బాడుగ ప్రతినెలా చెల్లించకపోయినా వారి నుంచి ముడుపులందుకుని మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. ● శాశ్వత పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోయినా వచ్చినట్లు మస్తర్లు వేసి వారి నుంచి కొంతమంది ఉద్యోగులు కమీషన్లు తీసుకుంటున్నారని, వారు విధులకు రాకపోవడంతో ఆ భారమంతా తమపై పడుతోందని కొంతమంది పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ప్రజారోగ్యం విభాగంలో కింది స్థాయి సిబ్బందికి సెలవులు మంజూరు చేయాలన్నా, ఇతర ఏ పనులు చేయాలన్నా ఉన్నతాధికారులకు చేతులు తడిపితేగాని పనులు కావడం లేదని సిబ్బందే వాపోతున్నారు.

### పారిశుద్ధ చర్యలంటూ నిధుల గోల్‌మాల్

తాడేపల్లిగూడెంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు, మరమ్మతు పనుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. మొన్నటి వరకు మంచినీటి ట్యాంకులను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్న సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండానే పైపులైన్లను ఏర్పాటు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు కడకట్ల ఈతకొలను సమీపంలోని ఓ లేఅవుట్‌కు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి నాలుగు అంగుళాల పైపును సుమారు 250 మీటర్ల మేర వేశారు. ఇందుకు వినియోగించిన పైపులు, పరికరాలు మున్సిపాలిటీకి చెందినవే కావడం గమనార్హం.

### తాకీదులు జారీ

తణుకులో అయిదేళ్లగా పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న టీపీబీవోపై వచ్చిన పలు అభియోగాలపై ఇటీవల మెమోలు జారీ చేశారు. అనధికార కట్టడాల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఎటువంటి దస్త్రం కదలాలన్నా ముడుపులిస్తే కాని అవడం లేదని సీనియర్ ఎల్‌టీపీలు వాపోతున్నారు. ఆరోపణలున్న అధికారులపై ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ నాగనరసింహారావు తెలిపారు.

# ఇలా నేరస్థుల ఆట పట్టిస్తాం!



రివాల్వర్ పనితీరును వివరిస్తున్న అధికారి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా భీమవరంలోని త్యాగరాజ భవనంలో పోలీసు ఓపెన్ హౌస్‌ను శుక్రవారం నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, సాంకేతికత గురించి వివరించారు. రివాల్వర్, తుపాకుల పనితీరు, భద్రపరచడం తదితర వివరాలను పోలీసు అధికారులు తెలియజేశారు. చోరీలు, నేరాలు జరిగినప్పుడు వేలిముద్రల సేకరణ, దొంగలను పట్టుకోవడంలో జాగిలాల పాత్రపై అవగాహన కల్పించారు.



తిలకించేందుకు వచ్చిన విద్యార్థులు

# దస్తావేజులు వచ్చేశాయ్!

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో దస్తావేజుల (స్టాంపు పేపర్లు) స్థానంలో ఈ-స్టాంపు పత్రాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా నాటి పాలకులు పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాత విధానంలో స్టాంపు పత్రాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. జిల్లాల వారీగా స్టాంపు పత్రాలు ఎన్ని అవసరమనే వివరాలను గత నెలలో సేకరించారు. రెండు రోజుల కిందట ఈ పత్రాలు నాసిక్ నుంచి విజయవాడకు రాగా అక్కడి నుంచి శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రానికి వచ్చాయి. ప్రస్తుతం నాలుగేసి పెట్టెల్లో రూ.50, రూ.100 విలువైన పత్రాలను తీసుకొచ్చారు. వీటి విలువ రూ.48 లక్షలని అధికారులు తెలిపారు. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శనివారం పంపిణీ చేయనున్నారు.



శ్రీవారి గరుడ వాహన సేవ



# శరణాగతి.. గరుడా చలపతి

**వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే:** కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ కనులపండువగా జరిగింది. మలయప్పస్వామి మకరకంఠి, లక్ష్మీహారం వంటి విశేష తిరువాభరణాలు ధరించి గరుత్మంతుడిపై దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులకు ఆశీస్సులు అందించారు. గరుడ వాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడనని చాటారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరే మానవులు గరుడను దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని ప్రతీతి. తొలుత నదీ జలాల సంగ్రహణం, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం తదితర కార్యక్రమాలు జరిపించారు. శనివారం మహాపుష్పయాగం, సూర్య చంద్రప్రభ వాహన సేవ, సహస్రదీపాలంకరణ సేవ ఉంటాయి.

## మెరుగైన ర్యాంకు సాధిస్తాం

● చురుగ్గా కొత్త పంటలపై పరిశోధనలు ● ఉద్యాన విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ 8లో

# నేడు యువజనోత్సవాలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లా స్థాయి యువజనోత్సవాలను తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ఆవరణలో ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సెట్‌వెల్, యువజన సర్వీసులు శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

**ఈనాడు, భీమవరం, న్యూస్‌టుడే-పాలకొల్లు మార్కెట్, కైకలూరు, ముదినేపల్లి**

**దివ్యాంగులను విభిన్న నైపుణ్యాలతో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన భవిత కేంద్రాలు సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. చాలీచాలని ఇరుకు గదుల్లో బోధన సాగుతోంది. ఆట వస్తువుల సరఫరాలోనూ గత ప్రభుత్వ వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి. అటు ప్రయాణ భత్యాలూ అరకొరగా అందుతున్నాయి.**

# అరకొర భత్యం.. అవస్థలు నిత్యం

● దివ్యాంగుల భవితకేదీ భరోసా
● నిలిచిన ఆట వస్తువుల సరఫరా
● ఇరుకు గదుల్లో ఇక్కట్లు



బుట్టాయగూడెం భవిత పాఠశాలలో మూలకు చేసిన బోధన పరికరాలు

ముదినేపల్లి భవిత కేంద్రంలో మధ్యాహ్న భోజనం అందించేందుకు ఇబ్బందిగా ఉండటంతో ఆరు నెలల క్రితం ఖాళీ చేసి ఉన్నత పాఠశాలలోకి మార్చారు. ఒకే గదిలో ఇక్కడ 20 మంది విద్యార్థులు, పరికరాలు ఉండటంతో ఇరుకుగా ఉంది. మరుగుదొడ్లకు వెళ్లేందుకు ర్యాంపు సౌకర్యం లేక దివ్యాంగులకు అవస్థలు తప్పటం లేదు.

కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా ద్వారా పాఠశాలలను నిర్వహిస్తోంది. గతంలో ప్రత్యేకంగా కేంద్రాల్లో నిర్వహించేవారు. ఈ కేంద్రాల్లో 21 రకాల వైకల్యాలు ఉన్న వారు చదువుకునేందుకు అవకాశం ఉంది. మధ్యాహ్న భోజన పథకం అందకపోవటం..క్రీడా మైదానాలు అందుబాటులో లేకపోవటం..సాధారణ విద్యార్థులతో మమేకమవడం కోసం ఉన్నత పాఠశాలలకు మార్చాలని ఆదేశాలొచ్చాయి. నాడు-నేడులో వీరి ప్రత్యేకంగా గదులు కూడా నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పనులు ముందుకు సాగలేదు. దీంతో మొత్తం 28 పాఠశాలల్లో 11 మాత్రమే ఉన్నత పాఠశాలల్లోకి మార్చారు. మిగిలిన 17 ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహిస్తున్నారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని కేంద్రం సుబ్బమ్మదేవి పాఠశాలలోకి మార్చాలని ఆదేశాలున్నా అక్కడ గదుల్లేవు.

● ఏలూరు శనివారపుపేటకు చెందిన ఓ విద్యార్థిని ఆమె తల్లి రోజా అశోక్‌నగర్ భవిత పాఠశాలకు ఆటోలో తీసుకువెళతారు. ప్రయాణాలకు నెలకు రూ.3వేలు ఖర్చవుతోంది. ప్రభుత్వం ఏడాదికి రూ.3వేలు మాత్రమే ఇస్తోంది. దీంతో పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడుతోంది.

● నిబంధనల ప్రకారం విద్యార్థులను ఉపాధ్యాయులే పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకురావాలి. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఎక్కడా ఇలా చేయడం లేదు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు మాత్రమే పిల్లలను పాఠశాలలకు తీసుకువస్తున్నారు. మిగిలిన వాళ్లు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

### పరిమిత సదుపాయాలతో ఇబ్బందులు

బోధన పరికరాల సరఫరా నిలిచిపోయింది. బుట్టాయగూడెం కేంద్రంలో చాలా పరికరాలు మూలకు చేరగా మిగిలిన వాటినే వాడుకుంటున్నారు. గతంలో తాగునీరు, విద్యుత్తు ఛార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల కోసం ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.10వేలు మంజూరు చేసేవారు. వైకాపా ప్రభుత్వం వీటికీ నీళ్లొదిలింది. కైకలూరులో ఉపాధ్యాయులు సొంత నిధులు వాడుతున్నారు. దీనిపై భవిత కేంద్రాల జిల్లా సహాయ సమన్వయకర్త భాస్కర్ మాట్లాడుతూ.. భత్యాలు సకాలంలో జమ చేస్తామని.. పాఠశాలలను త్వరలోనే ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తామని తెలిపారు.



ముదినేపల్లిలో ఇరుకుగదిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రం

జిల్లాలో భవిత కేంద్రాలు సంఖ్య: 19
మొత్తం విద్యార్థులు : 380
మొత్తం 38 ఉపాధ్యాయులు

పాలకొల్లు మండలంలోని భవిత కేంద్రాన్ని గతంలో ఏఎస్‌ఆర్‌ఎన్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించేవారు. ఆవరణలో ఉన్న చెట్టు కూలి శిథిలమవడంతో దగ్గరలోని మరో పాఠశాలకు మార్చారు. పాఠశాలల విలీనంలో భాగంగా ఈ కేంద్రాన్ని 250 మీటర్ల పరిధిలోని ఎస్‌కేపీఎన్‌టీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కలపడంతో విద్యార్థులు అక్కడే చదువుతున్నా భోజనం ఇక్కడ నుంచి తీసుకువెళ్తున్నారు.

# న్యాయమూర్తుల బదిలీలు

**ఏలూరు టూటౌన్, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పలువురు న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతులు కల్పించి ఇతర స్థానాలకు బదిలీలు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.అనూరాధకు ఉద్యోగోన్నతి కల్పించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు తొమ్మిదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తిగా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పని చేస్తున్న బి.లక్ష్మీనారాయణకు ఉద్యోగోన్నతి కల్పించి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మూడో అదనపు డిస్ట్రిక్ అండ్ సెషన్స్, స్పెషల్ జడ్జి ట్రైల్ ఆఫ్ అఫెన్సెస్ అండ్ ది ప్రొటెక్షన్ ఆఫ్ పోక్సో యాక్ట్ జడ్జిగా నియమించారు.

### 11 మంది ఏఎస్సైలకు...

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన 11 మంది ఏఎస్సైలు, 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 37 మంది కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

# వారం రోజుల్లో లేసు పార్కు పాలకవర్గ ఎన్నికలు

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** రుస్తుంబాద లేసు పార్కు పాలకవర్గ ఎన్నికలు వారం రోజుల్లో పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మేనేజరు ఎస్.కుసుమకుమారి తెలిపారు. లేసు పార్కు పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, వీరవాసరం, పోడూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల పరిధిలో గ్రామ స్థాయిలో 51 అలంకృతి లేసు అల్లికల సహకార సంఘాల ప్రతినిధుల ఎన్నిక పూర్తయ్యిందన్నారు. ఆయా సహకార సంఘాల ప్రతినిధుల నుంచి అయిదుగురి సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకుంటారన్నారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం లేసు పార్కులో లేసు అల్లికలు, శిక్షణ వంటి కార్యకలాపాలను విస్తృతం చేస్తామన్నారు.

**తాడేపల్లిగూడెం అర్బన్, జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని పలు పట్టణాల్లో స్థలాలు, స్థిరాస్తి విక్రయాల్లో మోసాలు పెరిగిపోయాయి. కొందరు డబుల్ రిజిస్ట్రేషన్లతో మోసగిస్తుంటే, మరికొందరు నకిలీ పత్రాలు, డాక్యుమెంట్లతో బురిడీ కొట్టిస్తున్నారు. పక్క సర్వే నంబర్లు వేసి ఓ స్థలాన్ని ఇద్దరు, ముగ్గురికి అమ్మడం, అసలు స్థలాలే లేకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా డాక్యుమెంట్లు సృష్టించి మోసగిస్తున్నారు.


### అసలు స్థలం లేకుండానే..

జంగారెడ్డిగూడెం బస్టాండ్ వెనుక ప్రాంతంలో కరోనా సమయంలో ఓ వ్యాపారి సుమారు రూ.30 లక్షలతో 250 గజాల స్థలం బాగా తెలిసిన వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. తీరా చూస్తే అక్కడ స్థలం లేదు.

**పూర్వార్జితం అంటూ..** పేరంపేట రోడ్డులో ఓ వ్యక్తి తన పూర్వార్జితం అంటూ స్థలం లేకుండానే అమ్మేశాడు. తొలుత కుటుంబ సభ్యుల పేరున రిజిస్టర్ చేసినట్లు సమాచారం. ఆ తరువాత ఆ డాక్యుమెంట్ చేతులు మారింది. తాజాగా కొన్న వ్యక్తి.. డాక్యుమెంట్ ఆధారంగా జన బలంతో ఓ దుకాణం వద్ద సామగ్రి బయట వేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ భవన నిర్మాణ దారులు ఆ వ్యక్తిని బయటకు నెట్టారు.

# జాగా లేకున్నా విక్రయం

● ఒకే ఆస్తి ఇద్దరికి రిజిస్ట్రేషన్
● బరి తెగిస్తున్న రియల్టర్లు!



### ధరలు భారీగా పెరగడంతో..

స్థలాల ధరలు భారీగా పెరగడంతో మోసాలకు పాల్పడే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కొనుగోలుదారులు అప్రమత్తంగా లేకుంటే మోసపోవడం ఖాయం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలే కేంద్రంగా మోసాలకు తెగబడుతున్నారు. తప్పు సర్వే నంబర్లు వేసినా కొందరు కాసులకు కక్కుర్తి పడి రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. వివాదాస్పద డాక్యుమెంట్లను ఇతర పట్టణాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అక్రమార్కులపై కొరడా ఝుళిపించకుంటే భవిష్యత్తులో భూ వివాదాలు పెరిగే ప్రమాదం ఉంది.

### నంబరుకు /1 వేసి..

జంగారెడ్డిగూడెం పద్మా థియేటర్ ఎదురుగా ఓ వ్యాపారి అనధికార లేఅవుట్ వేశారు. అందులో సుమారు 200 గజాల స్థలాన్ని ఇద్దరికి విక్రయించారు. మొదటి సారి అసలు సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేశారు. రెండోసారి ఆ నంబరుకు/1 చేర్చి మరొకరికి కట్టబెట్టారు. కొనుగోలుదారుల్లో ఒకరు ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు స్థలం బాగు చేస్తుండగా.. రెండో వ్యక్తి వచ్చి అది తనదని గొడవ చేశాడు. ఆ తరువాత రెండు డాక్యుమెంట్లు పరిశీలించగా.. వ్యాపారి చేతిలో మోసపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో బాధితులు కొద్ది రోజుల కిందట స్థానిక నేత ఒకరి వద్ద పంచాయితీ పెట్టారు. విషయం తెలుసుకున్న వ్యాపారి ఊరు నుంచి ఉడాయించాడు.

### ఇద్దరికి అమ్మేశారు..

తాడేపల్లిగూడెంలో ఓ స్థిరాస్తి వ్యాపారి కడకట్ల ప్రాంతంలో లేఅవుట్ వేశారు. ఇందులో సుమారు 200 గజాల స్థలాన్ని ఓ దుకాణదారు కొన్నాడు. అదే స్థలాన్ని రెండేళ్ల అనంతరం హైదరాబాద్‌కు చెందిన మరో మహిళకు అమ్మారు. ఇటీవల మొదట కొన్న దుకాణదారుడు ఇల్లు కట్టుకోవడానికి చదును చేయిస్తుంటే మహిళ వచ్చి అడ్డుపడింది. అమ్మిన వ్యక్తికి దగ్గరకు వెళితే సరైన సమాధానం లేదు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

# పథకాల అమలులో అలసత్వం వద్దు : కలెక్టర్

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** భీమవరం మండలం రాయలం పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ నాగరాణి శుక్రవారం సందర్శించారు. విభాగాల వారీగా ఉద్యోగులతో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం వద్దని సూచించారు. ఆధార్ నవీకరణ శిబిరాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని.. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో దస్త్రాలను పరిశీలించారు. గ్రామంలో రూ.1.48 కోట్లతో చేపట్టిన పనుల వివరాలపై నివేదిక అందించాలని డీపీవోను ఆదేశించారు. అనంతరం రాయలం డ్రెయిన్‌ను పరిశీలించారు. పూడిక కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.



రాయలం డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న నాగరాణి

# చిక్కని చిరుత

**భీమడోలు, న్యూస్‌టుడే:** భీమడోలు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు శుక్రవారం సైతం నిఘా కెమెరాల్లో నిక్షిప్తం కాలేదు. బోన్లకూ చిక్కకపోవడంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. ఇదిలా ఉండగా... పెదవేగి మండలంలో చిరుత సంచరిస్తోందని చెబుతున్న అధికారులు.. దాన్ని పట్టుకునేందుకు మాత్రం భీమడోలు పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేయడం గమనార్హం. రేంజర్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి రాత్రింబవళ్లు ప్రత్యక్ష నిఘా కొనసాగిస్తున్నారు.



బోనును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

# వసూళ్లు తప్ప.. పనుల్లేవ్!

అధ్వానంగా పుంత మార్గాలు



వీరవాసరం పరిధిలో మెండుబోయిన పుంత మార్గం ఇది. సుమారు 800 ఎకరాల వరి చేలకు ఎరువులు, పురుగు మందులు తీసుకెళ్లాలన్నా.. పంట దిగుబడులను బయటకు తీసుకురావాలన్నా ఇదే ఆధారం. ఏళ్ల తరబడి ఇది అభివృద్ధికి నోచుకోకపోవడంతో రైతులు నరకం అనుభవిస్తున్నారు.

**విస్సాకోడేరు (పాలకోడేరు), భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:**

అన్నదాతల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ కమిటీలు అసలు లక్ష్యానికి దూరమై.. రైతులకు గుదిబండగా మారాయి. పంట ఉత్పత్తులపై రూ.కోట్లలో రుసుములు వసూలు చేయడం తప్ప గత అయిదేళ్లలో రైతులకు అవసరమయ్యే వసతుల కల్పనను పట్టించుకోలేదు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే పుంత మార్గాలు అధ్వానంగా మారడంతో పంట ఉత్పత్తులను బయటకు తెచ్చే మార్గం లేక రైతులు నరకం అనుభవిస్తున్నారు.

### ఆదాయం ఏమవుతోంది..

పశ్చిమగోదావరి జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటికి పంట ఉత్పత్తులపై సెస్ రూపంలో ఏటా రూ. 50 కోట్ల నుంచి రూ. 60 కోట్లు ఆదాయం సమకూరుతోంది. గతంలో ఈ ఆదాయంతో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేవారు. క్రమంగా పరిస్థితి మారిపోయింది. వైకాపా సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత రైతు ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారు. యార్డుల అభివృద్ధి, సిబ్బంది నియామకాలను గాలికొదిలేశారు. పలు చోట్ల రేకుల షెడ్లు, ప్రైవేటు భవనాల్లో చెక్ పోస్టులు నిర్వహిస్తున్నారు.

### నిధులు కేటాయిస్తే పనులు

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే అవసరమైన పుంత రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పశు వైద్య శిబిరాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తాం.

– కె.సునీల్‌కుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ, భీమవరం

పాలకోడేరు మండలం విస్సాకోడేరులో మంచాల దిబ్బ పుంత మార్గం ఇలా అధ్వానంగా మారడంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ గ్రామంలో ఆరు పుంత రహదారులు ఉండగా గత అయిదేళ్లలో ఒక్కటి కూడా అభివృద్ధికి నోచుకోలేదు. రెండేళ్ల కిందట పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కాలేదు.



# పూర్తిగా ఆన్‌లైన్లోనే

పంచాయతీల్లో ఆడిట్

**ఈనాడు డిజిటల్, భీమవరం:** గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తుల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభమైంది. ఆయా పంచాయతీల ఆదాయ, వ్యయాలపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఖర్చులు, వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లను పరిశీలిస్తున్నారు.

### నవంబరు నెలాఖరుకు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసే నిధులను సైతం గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో కేంద్రం పలు విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా ఈ ఏడాది ఆడిట్‌ను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు చేపట్టింది. పంచాయతీలు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించి ఆడిట్‌ను నిర్వహించకపోయినా తదుపరి అభివృద్ధి, ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమకావని హెచ్చరించింది. షెడ్యూలు ప్రకారం నవంబరు చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఆడిట్‌ను డిసెంబరు 31 నాటికి పూర్తిచేస్తారు. వ్యయాలపై అభ్యంతరాలుంటే వాటిని పరిష్కరించడానికి మూడు నెలల సమయం అనంతరం తుది నివేదికను మార్చిలో ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.



### గతానికి భిన్నంగా

గతంలో మాన్యువల్‌గా జరిగిన ఆడిట్ ప్రక్రియ ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. రికార్డులను సరిచూసిన అనంతరం వాటిని నేరుగా నమోదు చేస్తున్నారు.

### అలసత్వం వహిస్తే నిధులు రావు

ఉమ్మడి జిల్లాలో 1064 పంచాయతీల్లో 65శాతం ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. ఆడిట్ దస్త్రాల సమర్పణలో పంచాయతీ అధికారులు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా తదుపరి అభివృద్ధి నిధులు రావని జిల్లా ఆడిట్ అధికారి గంగాధరరావు వాపోయారు.

# ‘పది’ విద్యార్థులకు గణిత దీప్తి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు . ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన గణిత దీప్తి అధ్యయన పుస్తకాలను ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం విడుదల చేశారు

## బడుగుల ఆశాజ్యోతి సత్యనారాయణ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, వేదికపై ఆర్వీ రామారావు, రవీంద్రనాథ్ తదితరులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన పోరాట యోధుడు వంక సత్యనారాయణ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ ఉద్యమ నేత, మాజీ శాసన సభ్యులు కామ్రేడ్ వంకా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సురాజ్య భవన్ వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వంక సత్యనారాయణ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు, పత్రికా విలువలు అంశంపై స్మారకోపన్యాసం చేశారు. విలువలు రాజకీయ పార్టీలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ వంకా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్, రామారావు, సమంతర, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికతను రైతులకు చేరువ చేయాలి



ప్రసంగిస్తున్న సత్యనారాయణ

మార్టేరు, న్యూస్‌టుడే: సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరువ చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. పీవీ మాట్లాడుతూ.. ఆధునికతతో నిత్యం మమేకమయ్యే క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న విషయాలను రైతులకు వివరించాలన్నారు. కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిద్ధికి మాట్లాడుతూ.. డ్రోన్లపై అవగాహన, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల నివారణ, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, పరిశోధన స్థానం విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు త్రిపుర గవర్నర్ రాక

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన శనివారం ఉదయం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం భీమవరం చేరుకుంటారు. అక్కడ సమావేశం, వేడుకల్లో పాల్గొని రాత్రి పర్యాటకశాఖ అతిథి గృహంలో బసచేస్తారు. 27న ఉదయం భీమవరంలోని ఓ వివాహ వేడుకకు హాజరవుతారు. అనంతరం దొంగపిండి, లోసరి, తుందుర్రు గ్రామాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహిస్తారు. 3 గంటలకు తాడేపల్లిగూడెం బయలుదేరి వెళ్లి ఏపీ నిట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు తిరుగుప్రయాణమై విజయవాడకు వెళ్తారు.

## 27న జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జామాను బుజ్జిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లులో అగ్నిమాపక కేంద్రం సమీపాన ఉన్న ఎంఎంకేఎన్ఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పట్టణ, మండల స్థాయిల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఇందులో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 93942 38826, 98496 66417 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## ఏపీ ఐకాస అమరావతి మహిళా కమిటీల ఎన్నిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏపీ ఐకాస అమరావతి ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ మహిళా కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పి.లక్ష్మి హాజరయ్యారు. సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.రమేశ్ కుమార్ అధ్యక్షతన మహిళా కమిటీల ఎన్నికలు నిర్వహించారు. మల్లేశ్వరి, రమాదేవి, ఎన్.రోజా, డి.లక్ష్మి, సత్యవేణి, ఆదిలక్ష్మి, బి.ధనలక్ష్మి, ఏవీ రమాదేవి, పార్వతి, కె.హారిక, పి.సుజన ఎన్నికయ్యారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. పి.లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు పనిచేసే కార్యాలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



నూతన నాయకులతో సంఘ ప్రతినిధులు



# బెదరగొట్టి.. కొల్లగొట్టి!

**సైబర్ మాయగాళ్లతో జాగ్రత్త**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సైబర్ మోసాలకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. విద్యావంతులు సైతం మోసగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. వీరిలో కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బయటకు చెప్పుకోలేక కొందరు, ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనే భావనతో ఇంకొందరు పోలీస్‌స్టేషన్ గుమ్మం తొక్కడంలేదు. గత నాలుగేళ్లుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 143 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదు వరకు రానివి.. వచ్చినా కేసులు నమోదు చేయనివి ఇంతకు మూడు, నాలుగు రెట్లు అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు.

☛ భీమవరానికి చెందిన ఓ వైద్యుడి నుంచి సైబర్ నేరగాళ్లు ఇటీవల రూ. 73.20 లక్షలు కొట్టేయడం చర్చనీయాంశమైంది. మీ పేరిట ఉన్న పార్శిల్‌లో పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు, డ్రగ్స్, ల్యాప్‌టాప్‌లు ఉన్నాయంటూ ఫోన్‌లోనే బెదిరించి.. ఆయన బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకొని నగదు మొత్తం లాగేశారు.

☛ తాడేపల్లిగూడేనికి చెందిన వృద్ధుడికి ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో ఛాటింగ్ ద్వారా పరిచయమైంది. కొన్నిరోజుల పాటు హద్దులు లేని ఆన్‌లైన్ ముచ్చట్లు కొనసాగాక ఆమె జీవితం నాశనమైందంటూ అపరిచిత వ్యక్తులు సదరు వృద్ధుడికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగి రూ. 3 లక్షల వరకు కాజేశారు.



**రోజుకో కొత్త మోసం**

❖ మీ పేరిట వచ్చిన పార్శిల్‌లో డగ్స్, నిషేధిత వస్తువులు ఉన్నాయని.. విచారణకు సహకరించకుంటే అరెస్టు తప్పదంటూ సైబర్ క్రైం పోలీసుల పేరిట మోసగాళ్లు ఫోన్ చేస్తున్నారు. ముందుగా వారు పేరు, చిరునామా ఇతరత్రా కొన్ని వివరాలు చెప్పి బ్యాంకు ఖాతాల సమాచారం అడుగుతున్నారు. కాలర్ ఐడీ యాప్‌లలోనూ వారి ఫోన్ నంబర్లు దిల్లీ సైబర్, ముంబయి సైబర్ అని కనిపిస్తుండటంతో కొందరు భయపడి వివరాలు చెప్పగానే ఖాతాల్లో సొమ్మంతా లాగేస్తున్నారు.

❖ ఆన్‌లైన్ స్నేహం పేరిట వివిధ యాప్‌ల ద్వారా మోసగాళ్లు అందినకాడికి లాగేస్తున్నారు. యువత, మహిళలతో ఆన్‌లైన్ ఛాటింగ్, వీడియోకాల్స్‌తో ఎరవేస్తున్నారు. తర్వాత సదరు యువతి ఆత్మహత్య చేసుకుందని.. అంతకు ముందు ఆమె మీతోనే మాట్లాడిందని బెదిరించి సొమ్ము డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి బాధితుల్లో వృద్ధులూ ఉండటం గమనార్హం.

❖ మీకు లాటరీ వచ్చిందని, లక్కీడిప్‌లో మీ చరవాణి నంబరు ఎంపికైందని నమ్మిస్తున్నారు. దీనికి ముందుగా పన్నులు చెల్లించాలంటూ సొమ్ము కాజేస్తున్నారు.

**1930 నంబరుకు కాల్ చేయండి**

'సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సంబంధిత బ్యాంకు ఖాతాల్లో నగదు బదలాయింపులు నిలిపివేస్తారు. దీనివల్ల రికవరీకి అవకాశం ఉంటుంది. సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా ఫోన్‌లో బ్యాంకుఖాతాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారం కోరితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దు.

**- అద్నాన్ నయీం అస్మి, ఎస్పీ, పశ్చిమగోదావరి**

# మాటలకందని విజయాలు!

**క్రికెట్, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న బధిర యువతి**



మీనా సూర్యకుమారి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విధి చిన్నచూపు చూసినా వెరవక ధైర్యంగా ముందుకు సాగుతూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొనే వారు అరుదుగా ఉంటారు. ఈ కోవలోకే వస్తారు వీరవాసరం మండలం బుధారాయుడుచెరువు గ్రామానికి చెందిన చదరం మీనా సూర్యకుమారి. పుట్టుకతోనే మూగ అయిన ఈమె క్రికెట్, అథ్లెటిక్స్ క్రీడలతో పాటు నృత్యంలో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకున్నారు.

**పాఠశాల స్థాయి నుంచి..** మీనా సూర్యకుమారికి మాటలు రావు. భీమవరంలోని శ్రీవేంకటేశ్వర బధిరోన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతి పూర్తి చేసేలోపు అథ్లెటిక్స్ (పరుగు, లాంగ్ జంప్, హైజంప్)లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు అందుకున్నారు. అనంతరం తిరుపతిలో ఇంటర్మీడియట్ చదివారు. అక్కడ కూడా క్రీడల్లో బహుముఖ ప్రతిభతో రాణించారు. విజయవాడలో డిగ్రీ చదువుతున్న సమయంలో క్రికెట్, నృత్యంలో శిక్షణ పొందారు. వివిధ సాంస్కృతిక వేదికలపై నృత్య ప్రదర్శనలిచ్చారు.

★ ఆంధ్రప్రదేశ్ బధిర మహిళా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో మీనా పాల్గొన్నారు. ముంబయిలో ఈ ఏడాది జనవరిలో జరిగిన టి-20 టోర్నీలో బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తాచాటారు. ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు హరియాణాలో జరిగిన క్రికెట్ టోర్నీలోనూ రాణించి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. చదువులో రాణిస్తూనే క్రీడా ప్రతిభతో ఉద్యోగం సంపాదించాలన్నదే మీనా లక్ష్యమని ఆమె తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, విజయభాస్కరరావు చెప్పారు.

# వైకాపా నాయకుడి కోపం.. ప్రజలకు శాపం!

**సీసీ రహదారిపై కంచె, రాళ్లు పేర్చిన వైనం**



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రభుత్వం మారినా వైకాపా నాయకుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. మమ్మల్ని ఏమీ చేయలేరంటూ పంచాయతీ రోడ్లకు అడ్డంగా కంచెలు, గోడలు కట్టి ప్రజల రాకపోకలను అడ్డుకుంటున్నారు. వారిని అడ్డుకునే ధైర్యం లేక అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. అటువంటి ఘటన ఒకటి తాజాగా ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో వెలుగుచూసింది. ఈ గ్రామంలో ఆరేళ్ల కిందట గీతా మందిరం వీధిలో పంచాయతీ అధికారులు సీసీ రహదారి నిర్మించారు. ఆ ప్రాంతంలో ఓ ఇంటి వద్ద రోడ్డు పక్కనే ఇంకుడు గుంత తవ్వారు. దానిని పూడ్చాలంటూ రెండు నెలల కిందట గ్రామానికి చెందిన వైకాపా నేత బోళ్ల వెంకట కిశోర్ సదరు వ్యక్తులతో గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా ప్రజలు రాకపోకలు సాగించే రహదారికి అడ్డంగా కంచె వేయడంతో పాటు రాళ్లతో గోడలాగా పేర్చి అటుగా రాకపోకలు లేకుండా మూసివేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అనేకసార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. విసుగు చెందిన కొందరు ఇటీవల ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

## నేటి నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు

మార్టేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ అండర్-17 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు, సెలక్షన్స్ ఈ నెల 26 నుంచి మార్టేరు ఎస్వీజీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ హెచ్ఎం సీహెచ్ సీఎస్ఎన్.రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పోటీలను ప్రారంభిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధ్యక్షతన జరిగే పోటీల ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ సి.నాగరాణి, కాకినాడ ఆర్జేడీ ఎస్ఈ జి.నాగమణి, జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారని చెప్పారు. సమావేశంలో రిసోర్స్‌పర్సన్ అంజలి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**29న ఖోఖో జట్ల ఎంపిక..**

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 29న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. మరిన్ని వివరాలకు 83283 12583 నంబరును సంప్రదించాలని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహణాధికారిణి కె.అలివేలు మంగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ముగిసిన విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు



ఎంపికైన జట్టుతో రిజిస్ట్రార్ సుధాకర్ తదితరులు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలలో విజేతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీలలో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని, జి.మామిడాడలోని డీఆర్‌కె రెడ్డి కళాశాల ద్వితీయ, పెనుగొండలోని ఎస్వీకేపీ కళాశాల తృతీయ, ఏలూరు సీఆర్ఆర్ కళాశాల నాల్గవ స్థానాలను సాధించాయని ప్రకటించారు. క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి హాజరైన 13 టీమ్‌లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను, అదనంగా మరో నలుగురు క్రీడాకారులను నన్నయ విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారని రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తెలిపారు. ఈ జట్టు నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. నిర్వహణా కార్యదర్శి డా.ఎం.వి.ఎస్.ఎస్. మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు, రైల్వేకోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు పీఆర్ కళాశాల పీడీ రమణ, కోర్స్ కోఆర్డినేటర్ డా.కె.బాలసత్యనారాయణ, డా.ఎ.సత్యనారాయణ, డా.బి.రామ్‌గోపాల్, డేవిడ్, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

# మెరుగైన ర్యాంకు సాధిస్తాం

● చురుగ్గా కొత్త పంటలపై పరిశోధనలు ● ఉద్యాన విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ

**ముఖాముఖి**



గోపాల్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించేలా కృషి చేస్తున్నామని ఇన్‌ఛార్జి ఉప కులపతి కురుబ గోపాల్ తెలిపారు. దేశంలో మొదటి 40 స్థానాల్లో వర్సిటీ నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా పీఎంఈ సెల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టి రెండు నెలలు పూర్తయిన సందర్భంగా 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**మూడు ఏఐసీఆర్పీలు మంజూరు**

ఐసీఏఆర్ సహకారంతో కొత్త పంటలపై పరిశోధనలు చేసేందుకు ఉద్యాన విశ్వవిద్యాలయానికి మూడు ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ ప్రాజెక్టులు (ఏఐసీఆర్పీ) కొత్తగా మంజూరయ్యాయి. మహానంది (నంద్యాల జిల్లా), దర్శి (ప్రకాశం జిల్లా), పెద్దపేట (శ్రీకాకుళం జిల్లా)లోని పరిశోధన స్థానాలకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఏఐసీఆర్పీల ద్వారా మహానందిలో క్వినోవా, ఫాబాబీన్, దర్శిలో గ్రెయిన్ అమరాంత్, పెద్దపేటలో వింగ్డ్ బీన్ వంటి కొత్త పంటలపై ప్రయోగాలు జరుగుతాయి. ఇప్పటికే ఆయా పరిశోధన స్థానాల్లోని ఒక్కరు చొప్పున ముగ్గురు శాస్త్రవేత్తలు మేఘాలయలో జరిగిన కార్యశాలకు వెళ్లారు.

**కొత్త కోర్సులు, విభాగాలు**

ఉద్యాన డిగ్రీ ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్నాం. అటవీ, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రాసెసింగ్ వంటి కోర్సులు అందుబాటులోకి తీసుకొస్తాం. పీజీ, పీహెచ్‌డీలో కీటక, మొక్కల తెగుళ్లు, ప్రజనన విభాగాలు అందుబాటులోకి తెస్తాం. నాబార్డు-ఆర్‌డీఎఫ్ నిధులు రూ.3.97 కోట్లతో నిర్మించిన కేంద్ర గ్రంథాలయాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం.

**47 మందికి స్థాన చలనం**

గత నాలుగేళ్లలో వర్సిటీలో బదిలీలు జరగలేదు. చాలా మంది బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల శాస్త్రవేత్తలు, సీనియర్ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు మొత్తం 47 మందిని బదిలీ చేశాం. గతేడాది కొత్తగా ప్రారంభించిన పులివెందుల ఉద్యాన కళాశాలకు అసోసియేట్ డీన్‌ను కూడా నియమించాం. రెండేళ్ల నుంచి వర్సిటీ ప్రధాన పోస్టులను ఇన్‌ఛార్జులే నెట్టుకొస్తున్నారు. ఇన్‌ఛార్జులను తొలగించి, నిబంధనల ప్రకారం ఎవరు ఏ పోస్టుకు అర్హులో వారినే నియమించాం. ఒక్క కంప్ట్రోలర్ పోస్టు మాత్రమే రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వర్సిటీ పరిధిలోని అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకేతర సిబ్బందికి వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

## విద్యుత్తు సమస్యలకు సత్వర పరిష్కారం



ఫోరం ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసింహారావు

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: వినియోగదారుల విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరిస్తున్నామని వినియోగదారుల ఫోరం ఛైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. నారాయణపురం ఉపకేంద్రం కార్యాలయంలో శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నప్పుడు వారికి నాణ్యమైన సేవలందించాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 395 ఫిర్యాదులందగా.. 315 పరిష్కరించామన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులకు 107 కేసుల్లో రూ.14.26 లక్షల జరిమానా విధించామన్నారు. వినియోగదారులు విద్యుత్తు సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వివిధ విద్యుత్తు సమస్యలపై తల్లాపురం సర్పంచి పసుపులేటి నరసింహారావుతో పాటు తదితరులు వినతిపత్రాలు అందజేశారు. ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ అంబేడ్కర్, ఏడీ రామకృష్ణ, ఫోరం సభ్యులు ఎస్ఎం మణి, షేక్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎక్సైజ్ పోలీసులు వేధించారంటూ**

## యువకుడి ఆత్మహత్యాయత్నం

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ఎక్సైజ్ అధికారులు వేధించారంటూ ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన కామవరపుకోట మండలంలో చోటుచేసుకుంది. తడికలపూడి, కళ్లచెరువు, జీలకర్రగూడెం, కేఎస్ రామవరం గ్రామాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నలుగురిని చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ ఆధ్వర్యంలో గురువారం పట్టుకుని చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీరిలో తడికలపూడికి చెందిన అందుగుల రత్నారావు అనే యువకుడు స్టేషన్‌లో తనను దుర్భాషలాడి, కొట్టిన చిత్రాలను పలు వాట్సప్ గ్రూపుల్లో పెట్టారంటూ మనస్తాపం చెంది.. అదే రోజు రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందింది. విషయం తెలుసుకున్న అతడి బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 'రత్నారావు చెప్పినవి అవాస్తవాలు. అతడిని దుర్భాషలాడటం, కొట్టడం వంటివి చేయలేదు' అని చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

## బస్సులో కుప్పకూలి కండక్టర్ మృతి

పెనుగొండ, న్యూస్‌టుడే: విధుల్లో ఉండగానే గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి చెందిన ఘటన పెనుగొండ మండలం వడలిలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కొవ్వూరు డిపోనకు చెందిన బస్సు భీమవరం నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా వడలి గ్రామంలోని శ్రీనివాస సర్వీసింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి కండక్టర్ కె.ఎస్ నారాయణకు గుండెపోటు వచ్చింది. బస్సులోనే కుప్ప కూలి మృతి చెందారు. ప్రస్తుతం నారాయణ కొవ్వూరులో నివాసం ఉంటున్నట్లు సమాచారం.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

## వేతనాలు అందక ఇబ్బందులు



మాట్లాడుతున్న నిర్మలాదేవి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని ఏపీ వెలుగు యానిమేటర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం జిల్లా సమావేశం అధ్యక్షురాలు ఎ.నిర్మలాదేవి అధ్యక్షతన భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ యానిమేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు చోట్ల వీవోఏలను తొలగించి అధికార పక్షానికి చెందిన వారిని నియమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. వైకాపా హయాంలో ఇచ్చిన కాలపరిమితి జీవోను మళ్లీ తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో వీవోఏలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాయ్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

# భీమవరం

• భీమవరం • ఉండి

## నేడు డయల్ యువర్ డీఎం

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం సత్యనారాయణ మూర్తి శుక్రవారం తెలిపారు. భీమవరం డిపో పరిధిలో అయిదు మండలాలకు చెందిన ప్రయాణికులు సమస్యలతో పాటు సూచనలను 99592 25485 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

భీమవరం- అమలాపురం మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సు.. భీమవరం-అమలాపురం మధ్య కొత్తగా ఎక్స్‌ప్రెస్ బస్సును శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు డీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఈ సర్వీసును ప్రారంభిస్తారని వెల్లడించారు.

## అగ్నిమాపక కేంద్రంలో తనిఖీలు


గౌరవ వందనం స్వీకరిస్తున్న శ్రీనివాసులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** అగ్నిమాపక శాఖ అదనపు సంచాలకుడు జి.శ్రీనివాసులు భీమవరంలో అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం తనిఖీలు చేశారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కేంద్రంలో వసతులు, మంటలను ఆర్పేందుకు ఉపయోగించే శకటాల వివరాలు, దస్త్రాలను పరిశీలించారు. డీఎఫ్‌వో బి.శ్రీనివాసు, ఏడీఎఫ్‌వో సీహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

| | | | |
|---|---|---|---|
| భీమవరం పట్టణం | :80085 74471 | వీరవాసరం | :80085 74475 |
| భీమవరం మండలం | :80085 74533 | ఉండి | :80085 74526 |
| ఆకివీడు | :80085 74525 | పాలకోడేరు | :80085 74467 |
| కాళ్ల | : 80085 74474 | | |

**కాళ్ల, న్యూస్‌టుడే**

**సమస్య:** కాళ్ల గ్రామంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న విద్యుత్తు స్తంభాలకు పాదులు అల్లుకున్నాయి. అక్కడున్న సీసీ కెమెరాను పాదులు కమ్మేస్తున్నాయి. తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. **- స్థానికులు**

**సమాధానం:** స్తంభాలకు అల్లుకున్న పాదుల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- రాంబాబు, విద్యుత్తు ఏఈ**

# అంతా తప్పుల తడక!

## రీసర్వే గ్రామ సభల్లో వెల్లువలా అర్జీలు

**వీరవాసరం, పాలకోడేరు, న్యూస్‌టుడే**

వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే తప్పుల తడకగా సాగిందని.. తమ భూముల విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేశారని పలువురు రైతులు వాపోతున్నారు. రీ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో ఇలాంటి సమస్యలపైనే ఎక్కువ అర్జీలు అందుతున్నాయి. అప్పట్లో ప్రభుత్వ ఒత్తిడితో అధికారులు సర్వేను హడావుడిగా ముగించారని.. దీంతో భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, ఎల్‌పీఎం నంబర్లు కేటాయించకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని రైతులు చెబుతున్నారు.

★ వీరవాసరం మండలానికి చెందిన కుటుంబానికి ఆర్‌ఎస్‌ఆర్ దాఖలా ప్రకారం 7.10 ఎకరాల భూమి ఉండగా రీ సర్వే అనంతరం 6.92 1/2 ఎకరాలుగా నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మరో మారు సర్వే చేసినా విస్తీర్ణం ఏ మాత్రం పెరగలేదు. భూమి ఎక్కడా ఆక్రమణకు గురికాలేదని.. 1930 నాటి సర్వేలోనూ పొరపాట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.


మత్స్యపురి: ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

★ మత్స్యపురి గ్రామానికి చెందిన గోడి షణ్ముఖరావుకు సర్వే నంబరు ఎ5, ఎ6లో 0.30 సెంట్ల భూమి ఉండగా రికార్డుల్లో మాత్రం నమోదు కాలేదు.

★ వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన పిప్పళ్ల ధనలక్ష్మి కుటుంబానికి 7.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రీ సర్వే చేశాక తమ భూ విస్తీర్ణం తగ్గిందని సదరు కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

★ పాలకోడేరు మండలం గరగపర్రులో శుక్రవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించగా రైతుల నుంచి 24 ఫిర్యాదులు అందాయి. రీ సర్వే అనంతరం తమ భూమి విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారని.. గతంలో పలుసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని బాధితులు అసహనం వ్యక్తం చేశారు. తప్పులను సరిచేసి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

**రైతుల సహకారంతో..**

గ్రామ సభల్లో అందిన అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఒకే ఎల్‌పీఎం నంబరులో కలిసిపోయిన భూములకు వేర్వేరు సంఖ్యలు కేటాయించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను కూడా పరిష్కరిస్తాం. 1930 నాటి సర్వేలోనూ పొరపాట్లకు అవకాశం లేకపోలేదు. రైతులు సహకరిస్తేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. **- ఏవీ రామాంజనేయులు, తహసీల్దారు, వీరవాసరం**

## అర్జీలను వేగంగా పరిష్కరించాలి

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** రీసర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం డ్రోన్లతో చేసిన రీసర్వే తప్పులతడకగా ఉండటంతో భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో రైతుల నుంచి వందలాదిగా అర్జీలు వస్తుండటంతో దీనికి నిదర్శనమన్నారు.

### నేడు చినకాపవరంలో గ్రామ సభ

**చినకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే:** చినకాపవరం గ్రామ సచివాలయం వద్ద శనివారం భూ రీ-సర్వే గ్రామ సభను నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటేశ్వరరావు తెలిపారు. భూ రీ-సర్వేలో లోపాలపై అధికారులకు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

## పశుగణన ప్రారంభం

**తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే:** అఖిల భారత పశుగణనకు రైతులు సహకరించాలని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని కోరారు. పశుగణన ప్రక్రియను తోలేరు గ్రామంలో ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు ప్రియాంక రాబర్ట్, సుమ తదితరులతో కలిసి పశుగణన వివరాలతో ఉన్న గోడ పత్రాలను ఆవిష్కరించారు.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పశుగణన సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. అఖిల భారత పశుగణన గోడపత్రాన్ని ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

## 29న మహాలక్ష్మి ధన, ధాన్య పూజోత్సవం



**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** ఆశ్వయుజ ధన త్రయోదశి సందర్భంగా భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29న మహాలక్ష్మి ధన, ధాన్య పూజోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిషనర్ బీఎం నగేశ్ శుక్రవారం తెలిపారు. లోక కల్యాణార్థం తొలిసారిగా భక్తులతో సామూహికంగా ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## 30 వరకు భీమేశ్వరుని దర్శనం నిలిపివేత

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పట్టణంలోని భీమేశ్వర స్వామి దర్శనాన్ని ఆలయ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈవో తోట శ్రీనివాసరావు తెలిపారు. 30న సాయంత్రం 4.31 గంటలకు సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు.

## 27న సహస్ర గళ పారాయణ యజ్ఞం

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి మండలం పెదపుల్లేరులో వీహెచ్‌పీ మాతృశక్తి విభాగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి విశ్వ హిందూ పరిషత్తు అఖిల భారత సంయుక్త ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరశర్మ ప్రధాన అతిథి, వక్తగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## 45 పనులకు ప్రతిపాదన

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి పంచాయతీ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఉపాధి హామీ గ్రామ సభను నిర్వహించారు. రూ.64 లక్షల విలువైన 45 పనులకు ప్రతిపాదించారని సాంకేతిక సహాయకుడు ఓమేగా రాజు తెలిపారు. సర్పంచి కమతం సౌజన్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సృజనకు పదును పెట్టేలా..

**'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు**

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు భీమవరంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం జరిగాయి. 'అంతర్జాలం వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై నిర్వహించిన వ్యాస రచన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టేలా ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పి.యామిని (9వ తరగతి), 8వ తరగతి విద్యార్థినులు ఇ.మోదశ్రీ, ఎన్.జనని వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ జి.రామకృష్ణ, రీజినల్ ఇన్‌ఛార్జి ఎస్.కృష్ణకిశోర్‌లు విజేతలకు బహుమతులు అందించారు.


హాజరైన విద్యార్థులు


విజేతలతో ప్రిన్సిపల్ రామకృష్ణ, తదితరులు

## ఉపాధి పనులపై విచారణ

**కాళ్ల, న్యూస్‌టుడే:** దొడ్డనపూడిలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలు దుర్గాభవానిపై గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ పి.సుజాత శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బినామీ మస్తర్లు, ఇతర అవకతవకలపై గ్రామస్థులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై వివరాలు సేకరించి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు భీమవరంలోని సీఎస్‌ఎన్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పోటీలు ఇటీవల భీమవరంలో జరగ్గా వై.మేఘన సాయిదుర్గ, రమ్య, కల్యాణి, షీమా, భవాని, సింధు, వెంకటరమణలు ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ చీడే సత్యనారాయణ అభినందించారు.

## శుద్ధి నీరు అందక ఇక్కట్లు

**దెయ్యాలతిప్ప (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామం సమస్యలకు నిలయంగా మారిందని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. శుద్ధి చేసిన నీరు అందక స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని, మురుగు పారుదల వ్యవస్థ లేకుండా పోయిందని నినాదాలు చేశారు.


నినదిస్తున్న దెయ్యాలతిప్ప వాసులు, సీపీఎం నాయకులు

**చెత్తతో నిత్యం అవస్థలు..**

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు పరిధిలో నిత్యం సేకరించే చెత్తను సిద్ధాపురం వెళ్లే రహదారి పక్కన దిగుమతి చేస్తున్నారు. అక్కడ చెత్తగుట్టలుగా పెరిగిపోయి రహదారిని కప్పేయడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చెత్త దిగుమతి చేయడానికి వచ్చిన ట్రాక్టర్లను పలువురు నాయకులు, స్థానికులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. తరచూ చెత్త సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వైకాపా కౌన్సిలర్ కె.జాన్‌వెస్లీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంపన సుబ్రహ్మణ్యంరాజు, స్థానికులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న స్థానికులు

### భీమవరం సినిమాలు

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| శ్రీపద్మాలయ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| శ్రీపద్మాలయ స్క్రీన్ 2 | దేవర |
| కిషోర్ స్క్రీన్ 1 | విశ్వం |
| కిషోర్ స్క్రీన్ 2 | లగ్గం |
| నటరాజ్ | వెనమ్ దిలాస్ట్ డాన్స్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1 | వెనమ్ దిలాస్ట్ డాన్స్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2 | సత్యం సుందరం |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3 | శ్వాగ్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4 | దేవర |
| విజయలక్ష్మి స్క్రీన్ 1 | ఎంత పనిచేశావ్ చంటి |
| మహాలక్ష్మి స్క్రీన్ 2 | పొట్టేల్ |

# నాణ్యమైన విద్య.. సత్వర వైద్యం

● వీటికే తొలి ప్రాధాన్యం.. త్వరలో తనిఖీలు ● 'న్యూస్‌టుడే'తో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** 'ప్రభుత్వ వసతి గృహాల్లో చక్కటి సౌకర్యాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి. ఆసుపత్రుల్లో సత్వర వైద్య సేవలు అందాలి. ఈ రెండూ కచ్చితంగా అమలయ్యేలా ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. త్వరలోనే తనిఖీలు నిర్వహిస్తాం.' అని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పలు అంశాలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.

**ధరల నియంత్రణ..**

నిత్యావసర సరకుల ధరలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారికి ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉల్లిపాయలు, టమాటా, కందిపప్పు, వివిధ రకాల వంట నూనెలను తక్కువ ధరకు అందిస్తున్నాం. అవసరాన్ని బట్టి మరికొన్ని ప్రాంతాల్లోనూ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

**భూ సమస్యలే ఎక్కువ..**

భీమవరం డివిజన్‌లో భూ రీ-సర్వేకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో భూ విస్తీర్ణం తగ్గిందంటూ ఎక్కువ మంది ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో రీసర్వే హడావుడిగా జరిగిన ప్రాంతాల్లో ఇలాంటి లోపాలు ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా వాటిని పరిష్కరిస్తాం. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ల సహాయంతో రీసర్వే చేసి హద్దులు నిర్ణయిస్తున్నాం.

**ధాన్యం కొనుగోళ్లు..**

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయింది. సిబ్బంది నేరుగా పొలం వద్దకే వెళ్లి ధాన్యంలో తేమశాతం కొలుస్తారు. ప్రస్తుతం గోనెసంచుల సేకరణ జరుగుతోంది. వీలైనన్ని ఎక్కువ సంచులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

**వృద్ధులకు న్యాయం చేస్తాం**

కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన వృద్ధులకు సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తున్నాయి. వారికి న్యాయం చేసేలా మా వంతు కృషి చేస్తున్నాం. వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం.

## సంప్రదాయ నృత్యంలో భళా..!

**జాతీయ స్థాయిలో ప్రతిభ**


భానుశ్రీ బృందం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పట్టణానికి చెందిన యువతులు సంప్రదాయ నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. భీమవరంలోని కేజీఆర్‌ఎల్ ఫార్మసీ కళాశాలలో చదువుతున్న వీరు మరికొందరికి నృత్య శిక్షణ ఇస్తూనే పలు చోట్ల జరిగే పోటీల్లో పాల్గొని సత్తాచాటుతున్నారు.

**సమష్టి కృషితో..** కడలి భానుశ్రీ పాఠశాల స్థాయి నుంచి నృత్య శిక్షణ పొందారు. ఈ విద్యలో రాణిస్తున్న ఆమె కళాశాల స్థాయిలో మరికొందరికి నేర్పుతున్నారు. డి.భవాని వర్షిత, కె.బాలశ్రీకృష్ణవేణి, పి.జయవాసవి లాస్య ప్రియ, అట్టాడ లక్ష్మీ భవాని, దండుబోయిన హైమావతి, శరణ్యలు శిక్షణ పొంది బృందంగా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. తెలంగాణలోని త్యాగరాయ గానసభ ప్రధాన మండపంలో ఈ నెల 10న జరిగిన అంతర్జాతీయ సంగీత, నృత్య సమ్మేళనంలో వీరు కూచిపూడి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పురస్కారం అందుకున్నారు. ప్రోత్సహిస్తే మరిన్ని ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు సంప్రదాయ నృత్యాన్ని మరింత మందికి నేర్పిస్తామని వీరు చెబుతున్నారు.

## ఎట్టకేలకు మరమ్మతులు



**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి-ఆరేడు రహదారిలో ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ఈ మార్గం దుస్థితిపై 'అధిక వర్షాలకు రహదారులు ఛిద్రం' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 18న ప్రచురితమైన వార్తకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రస్తుతం మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు.

ఈనాడు కథనానికి స్పందన

## మురికి కూపంలా చెరువు!



**గొల్లలకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే:** గొల్లలకోడేరులో ఒకప్పుడు స్థానికుల నీటి అవసరాలు తీర్చిన బ్రాహ్మణచెరువు ఇది. ఏళ్ల తరబడి నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రస్తుతం ఇలా మురికి కూపంలా మారిపోయింది. సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో నీటిని పూర్వం నుంచి స్థానికులు గృహావసరాలు, పశువులకు తాగునీటిగా ఉపయోగించేవారు. గత అయిదేళ్లలో ప్రక్షాళన, నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో చెరువులో నాచు పేరుకుపోయి నీరంతా పసర్లు తేలింది. చెత్త, వ్యర్థాలను కూడా దీనిలో వేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రస్తుతం ఈ చెరువు నిండా బీడు గడ్డి పెరిగిపోయింది.

**తీర్మానం చేసినా..** ఏడాది కిందట ఈ చెరువును ప్రక్షాళన చేసి మంచి నీటి అవసరాలకు వినియోగించేలా పంచాయతీలో తీర్మానం చేశారు. ప్రధాన చెరువుతో పాటు దీనిలో జలాలను తాగునీటి పథకాలకు మళ్లించాలని యోచించారు. కానీ పనులు పట్టాలెక్కలేదు. ఇటీవల స్థానికులు ఈ అంశాన్ని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లడంతో చెరువు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. ఇటీవల జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించామని, వచ్చే నెలలో పనులు చేపట్టాలని నిర్ణయించారని కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు.



## ముందస్తు చర్యలు తప్పనిసరి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు సూచించారు. మోగల్లు శివారు అరుంధతీ కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి ప్రకాశ్ కుమార్, ఏఎంవో శ్రీనివాసరావు, వైద్యులు నిరంజని, సీహెచ్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 70 లక్షలతో రహదారులకు మరమ్మతులు


మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

**వీరవాసరం, న్యూస్‌టుడే:** మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు రూ.70 లక్షలు నిధులు మంజూరు చేయించారని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని వెల్లడించారు. శుక్రవారం వీరవాసరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. నవుడూరు- మడుగుపోలవరం లంక, బుధారాయుడుచెరువు- తమ్మినీడివారి పాలెం, వీరవాసరం-పెర్కిపాలెం, శృంగవృక్షం- కమతాలపల్లి, కమతాలపల్లి- వెంప మార్గాల్లో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## వైకాపా బలోపేతానికి కృషి

**పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే:** ప్రతి నియోజకవర్గంలో సమన్వయంతో పనిచేసే కార్యకర్తలను గుర్తించి పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పెదఅమిరంలోని ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఏడు నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులపై అంతర్గతంగా చర్చించారు. వైకాపా అధికారం కోల్పోయాక తొలిసారి నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హాజరు కాలేదు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జిలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి, గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాజగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. అనంతరం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాంప్రసాద్, అంజిబాబు, సుబ్బారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** మినీ రవాణా ట్రక్కుతో పాటు గేదె, దూడలను అపహరించి కేసులో ఇద్దరిని ఆకివీడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. చినకాపవరం గ్రామానికి చెందిన సంగాని సూర్య మణికంఠ, సాకరావు సూరిబాబు కలిసి పెదకాపవరంలో వినీ రవాణా ట్రక్కును అపహరించారు. అనంతరం ఆకివీడులో గేదె, దూడలను చోరీ చేసి అదే ట్రక్కులో ఎక్కించి హనుమాన్ జంక్షన్‌కు పరారయ్యారు. వారిని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంతో పాటు గేదె, దూడలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**హత్యాయత్నం కేసులో ముగ్గురు..**

**కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే:** కాళ్ల మండలం కోలనపల్లిలో గతంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై హత్యాయత్నం చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని న్యాయస్థానంలో శుక్రవారం హాజరుపరిచినట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

## బాలిక అపహరణ

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** మాయమాటలు చెప్పి బాలికను అపహరించిన యువకుడిపై శుక్రవారం కిడ్నాప్, పోక్సో కేసులు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాలకోడేరుకు చెందిన బాలిక భీమవరంలోని ఓ కళాశాలలో చదువుతోంది. నర్సయ్య అగ్రహారానికి చెందిన కారు డ్రైవర్ మద్దాల మణికంఠ ఆ బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఈ నెల 19న ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు శుక్రవారం బాలికను భీమవరంలో వదిలి పరారయ్యాడు. బాలిక వాంగ్మూలం మేరకు ఆ యువకుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

# నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## పంట కాలువలు ప్రక్షాళన చేయాలి

**ఆచంట, న్యూస్‌టుడే:** జిల్లాలోని పంట కాలువలు ప్రక్షాళన చేసి, రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు కోరారు. శుక్రవారం వల్లూరులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న నీటి సంఘం ఎన్నికల్లో రైతు సమస్యలపై అవగాహన ఉన్న వారిని ఎన్నుకోవాలని సూచించారు. రైతులు పిల్లి శ్రీరాములు, సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

## దంతాలపై శ్రద్ధ అవసరం

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే దంతాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని యునైటెడ్ కాప్స్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట చాతుర్య పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి దంత పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దంత వైద్యులు పెనుమాక భార్గవ సాయిశ్రీ, క్లబ్ కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, జక్కంపూడి కుమార్, యర్రంశెట్టి వెంకటరత్నం, యునుకొండ శేషాద్రి, కానూరి ప్రభాకర్, సంగినీడి రంగారావు, గుండుమోగుల వీరస్వామి, గట్టిరెడ్డి సురేష్ పాల్గొన్నారు.

## తీరంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు: డీఎల్పీవో

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** కార్తిక మాసం సందర్భంగా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో నెల రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడతామని డీఎల్పీవో బి.జ్యోతిర్మయి తెలిపారు. సీతారామపురంలోని కార్యాలయంలో శుక్రవారం డీఎల్పీవో మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డివిజన్‌లోని పది మండలాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బీచ్‌లో పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. నెల రోజుల పాటు ప్రతి శని, ఆది, సోమవారాల్లో బీచ్‌లో డివిజన్‌లోని పారిశుద్ధ్య సిబ్బంది పనుల్లో పాల్గొంటారన్నారు. పల్లె పండగ సందర్భంగా గ్రామాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు నిత్యం ఉపయోగపడే వాటిని చేపట్టేందుకు పంచాయతీల వారీగా సమాయత్తం కావాల్సిందిగా ఈవోపీఆర్డీలు, గ్రామ కార్యదర్శులను ఆదేశించామన్నారు. డివిజన్‌లోని 195 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం స్ఫూర్తితో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిందిగా గ్రామ కార్యదర్శులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్దేశించిన గడువులో శుభ్రం చేయించడం, సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు గ్రామాల వారీగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు, డొంకలను ఉపాధి హామీ పథకంలో తొలగించేందుకు గ్రామ కార్యదర్శులు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించినట్లు డీఎల్పీవో పేర్కొన్నారు.

## గోతులతో గగ్గోలు!




**పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** అత్యవసర సమయంలో ప్రధాన రహదారుల్లో ప్రయాణం ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దొంగరావిపాలెం నుంచి పెనుగొండ వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి పలు గ్రామాల పరిధిలో గోతులతో అధ్వానంగా తయారయ్యింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. నిత్యం ఏదో చోట ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి కనీసం మరమ్మతులైన చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ.. రహదారులపై ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

✷ ఈ నెల 21న రావులపాలెం నుంచి పెనుగొండ వైపు వెళ్తున్న కారు వడలి సమీపంలో గోతుల్లో పడి ఆగిపోయింది. దీంతో కారులో ప్రయాణించే వారు అవస్థలు పడ్డారు.



✷ వీరవాసరం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన సైదు ప్రదీప్‌కుమార్ తన అన్నయ్య కిశోర్ పూడి మండలం ఎస్. తిమ్మాపురంలో ఉంటున్నాడు. అన్నయ్యకు అనారోగ్యంగా ఉండటంతో ఈ నెల 23న వెళ్లి చూసి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ సమీపంలో గోతుల్లో పడి వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆయన మృతి చెందాడు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే**

**సమస్య:** గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువు ఫిల్టర్ బెడ్ సమీపంలోని ప్రధాన రహదారి చెంత జల్ జీవన్ మిషన్ పైపు లైను నిర్మాణ పనులకు సంబంధించి తీసిన గొయ్యి పూడ్చలేదు. దీంతో ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గొయ్యిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
**- కవురు సత్యనారాయణ, మల్లవరం పెదలంక**

**సమాధానం:** సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
**- టి.లోకేశ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఏఈఈ**

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే**

**సమస్య:** స్థానిక 21వ వార్డు నాగేంద్రపురంలో గత కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీని కారణంగా రాత్రిపూట ఇబ్బందికరంగా ఉంటుంది.
**- వాసు, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
**- రాజ్‌కుమార్, పురపాలక డీఈ**

**సమస్య:** స్థానిక అచ్చుగట్లపాలెం బ్యాంక్ కాలనీ ముఖధారమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా చెత్త శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నాం.
**- సోంబాబు, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
**- దావీదురాజు, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

## వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** పొలమూరు గ్రామంలోని పలు ప్రాంతాల్లో నూతనంగా విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. వీధి దీపాల సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ స్పందించి గ్రామంలో పాడైన దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త తొలగింపు.. **పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** సిద్ధాంతం అయ్యన్నగారి కొట్టు సమీపంలో రహదారి పక్కన చెత్త వేస్తున్నారు. గాలికి చెత్త ఎగిరి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఈ నెల 23న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోమల మందు పిచికారీ.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** వడలిలో పలు ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్న వైనంపై ఈ నెల 4న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైంది. దానిపై సర్పంచి కాసాని విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

## ప్రభుత్వ చొరవతో చెత్త శుద్ధి కేంద్రం: ఎమ్మెల్యే



పరిశీలిస్తున్న నాయకర్, రామరాజు తదితరులు

**నరసాపురం, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం చొరవతోనే నరసాపురంలో చెత్త శుద్ధి కేంద్రం ఏర్పాటయ్యిందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో రూ.3.72 కోట్లతో చేపట్టిన లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంటు ప్రాజెక్టును ఆయన గురువారం ప్రారంభించారు. విజయవాడకు వరదలు సంభవించిన సమయంలో అక్కడకు వెళ్లి సేవలు అందించిన పురపాలక సంఘానికి చెందిన 40 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, కోటిపల్లి వెంకటేశ్వరరావు, పలువురు వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశుగణన గోడపత్రిక ఆవిష్కరణ.. **నరసాపురం, న్యూస్‌టుడే:** జాతీయ పశుగణన గోడపత్రికను శుక్రవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆవిష్కరించారు. ప్రజలు పశువులు, పెంపుడు జంతువుల వివరాలను అధికారులకు అందించి జాతీయ పశుగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పురపాలక ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గంగాలమ్మకు విశేష పూజలు



**నరసాపురం, న్యూస్‌టుడే:** ఎల్‌బీచర్ల లోని గంగాలమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు.

## దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పాలకొల్లు పట్టణం యడ్ల బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి రజత ఆభరణాలు, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కుంకుమ పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**మొగల్తూరు:** మొగల్తూరు కూరగాయల మార్కెట్‌లోని కనక దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల నిర్వహించిన దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

## వ్యాసం రాసి.. బహుమతి గెలిచి

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** జ్ఞాన సముపార్జనకు పోటీలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు ఎం.సురేష్ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ఏవీఎస్ఎన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాలం వినియోగంపై సత్ఫలితాలు, దుష్ఫలితాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు 'ఈనాడు' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానంలో కె.బాలబిందుశ్రీ (10వ తరగతి), ద్వితీయస్థానంలో జి.దివ్యశ్రీ (9వ తరగతి), తృతీయ స్థానంలో ఆర్.దేవకీనందకిశోర్ (9వ తరగతి) నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు డి.రాజ్‌కుమార్, పి.రాంజీ అంబేడ్కర్, ఎం.ప్రసాదరాజు, కె.వెంకటేశ్వరరావు, టి.చినబాబు పాల్గొన్నారు.

**నరసాపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఎస్ఎన్ఎస్ పాఠశాల, రుస్తుంబాద పురపాలక పాఠశాలల్లో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా 'అంతర్జాలంతో కలిగే లాభ నష్టాలు', 'సామాజిక మాధ్యమాలు విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎస్ఎన్ఎస్ పురపాలక పాఠశాలలో వరుసగా 1, 2, 3 స్థానాల్లో నిలిచిన సింగంశెట్టి పరిమిల, నెల్లూరి ధరిణి కొండరత్నం, నెల్లూరి సిరిఅనంతలక్ష్మిలకు ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ఎన్ రాజు, రుస్తుంబాద పురపాలక పాఠశాలలో శంకరగుత్తం నాగశ్రీ, కొట్టు ప్రవల్లిక, బండారు ధనశ్రీలకు ప్రధానోపాధ్యాయిని గీతాబాల చేతులమీదుగా బహుమతులు అందించారు.



నరసాపురంలో..




రుస్తుంబాదలో..

## సీహెచ్‌సీ భవనం.. కూలడానికి సిద్ధం

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** పాలకొల్లు సామాజిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వెయ్యి మందికి పైగా రోగులు వివిధ ఆరోగ్య సమస్యలపై వస్తుంటారు. పాలకొల్లు, ఆచంట, కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గాలకు చెందిన క్షతగాత్రులను సైతం ఇక్కడికే తీసుకొస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పేదల ఆసుపత్రి దయనీయ పరిస్థితిలోనే కొనసాగుతోంది. 2019లో అప్పటి ప్రభుత్వం(తెదేపా) వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసినా తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పైసా విదల్చకపోవడంతో పాత భవనంలోనే సేవలందించాల్సి వస్తోంది. సిబ్బంది గదులతో పాటు ప్రధాన ద్వారాల దగ్గర గోడలు బీటలు వారి కూలడానికి సిద్ధంగా భవనం శిథిలావస్థకు చేరింది. రోగులు ఉండే గదులు ఇరుకుగా ఉండటం సరిపడా మంచాలు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు సైతం అదే మంచంపై కూర్చోవడానికి, పడుకోవడానికి సతమతమవుతూ చిన్నపాటి యుద్ధమే చేయాల్సి వస్తోంది. ఆయా సమస్యలకు అద్దం పట్టే చిత్రాలివి.



నాచుతో ఆసుపత్రి గోడలు



ఒకే మంచంపై ఇద్దరు చొప్పున రోగులు

## అనుసంధానం చేయక అవస్థలు!

ఏడేళ్లుగా సాగుతున్న డ్రెయిను నిర్మాణ పనులు

**నరసాపురం, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి పక్కన నిర్మించిన పక్కా డ్రెయినుకు అంతర్గత డ్రెయిన్ల అనుసంధాన ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. సుమారు ఏడేళ్ల కిందట 216 జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలో ఒక వైపున పక్కా డ్రెయిను నిర్మించారు. ఆ డ్రెయినుకు అంతర్గత డ్రెయిన్లను అనుసంధానం చేయాల్సి ఉంది. కానీ నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. రుస్తుంబాదలో రహదారి పక్కన డ్రెయిను నిర్మాణ ప్రక్రియ నేటికీ పూర్తికాలేదు.



రాయపేటలో అనుసంధానం కాని కాలువ

**మురుగు సమస్య..** అంతర్గత డ్రెయిన్ల అనుసంధానం పూర్తి చేయకపోవడంతో పట్టణంలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. రాయపేట, రుస్తుంబాద, పురపాలక సంఘ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారింది. వర్షం కురిసిన సమయంలో రహదారులపై నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాధుల బారిన ప్రజలు..** దోమల ప్రభావంతో పట్టణ ప్రజలు డెంగీ, టైఫాయిడ్, గన్యా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజూ పదుల సంఖ్యలో ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు.



పురపాలక కార్యాలయ రహదారిపై నిలిచిన నీరు

**చర్యలు తీసుకుంటాం**

వెంటనే డ్రెయిన్‌ను పరిశీలిస్తా. జాతీయ రహదారి పక్కన నిర్మించిన ప్రధాన డ్రెయినుకు పట్టణంలోని అంతర్గత డ్రెయిన్లు అనుసంధానానికి చర్యలు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.
**- వెంకటరమణ, ఏఈ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, మచిలీపట్నం**

## ఆధ్యాత్మికతతో సమాజాభివృద్ధికి కృషి

**పెనుగొండ, న్యూస్‌టుడే:** ఆధ్యాత్మికతతో శాంతియుతంగా జీవిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు శిష్యుడు, చిలకలపూడి పాండు రంగ స్వామి ఆలయ ఆస్థాన ప్రచారకుడు భక్తరవితేజ అన్నారు. శుక్రవారం వడలి మందాలమ్మ అమ్మవారి ఆలయంలో సనాతన ధర్మ విశిష్టతను వివరించారు.

## ముందస్తు చర్యలు తప్పనిసరి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు సూచించారు. మోగల్లు శివారు అరుంధతీ కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.





## భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



వడలి: తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న కూటమి నాయకులు

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** భూ సమస్యలు పరిష్కారానికే రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. కె.బేతపూడిలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. సర్పంచి బెల్లపు రోజారాణి, ఇన్‌ఛార్జి ఆర్.ఐ ఎం.లక్ష్మీనారాయణ, వీఆర్వో పి.రామానుచార్యులు, రైతులు పాల్గొన్నారు.

**పెనుగొండ:** రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది శాశ్వత పరిష్కారం పొందేలా చర్యలు చేపడతామని తహసీల్దార్ జి.అనితాకుమారి అన్నారు. వడలి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభల్లో ఆమె మాట్లాడారు. సర్పంచి కాసాని విజయలక్ష్మి, ఉప తహసీల్దార్ డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**యలమంచిలి:** రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై మండలంలోని కాజలో రైతుల నుంచి తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ వినతులు స్వీకరించారు. ఆర్ఐ యశోద, సర్పంచులు పాలంకి శ్రీను, గుబ్బల వేణు, ఎంపీటీసీ సభ్యుడు రత్నారాజు, తెదేపా నాయకులు పీతల శ్రీను, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పోడూరు:** సర్వే సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు మండలంలోని కొమ్ముచిక్కాలలో తహసీల్దార్ సయ్యద్ మౌలాన్ ఫాజిల్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు.

## రహదారి ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** రహదారి ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన ఘటన శుక్రవారం మొగల్తూరులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజుగారితోటకు చెందిన రాయుడు దశరథుడు తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై పాత కాలువ ప్రాంతం నుంచి గ్రామానికి వెళ్తుండగా 216 జాతీయ రహదారికి ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో మరొక ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో దశరథుడు, ఆయన భార్య గాయపడ్డారు. వారిని 108లో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అవి ఇవి అన్నీ

కళాశాలకు వితరణ.. **ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడానికి ప్రిన్సిపల్, సిబ్బంది వినూత్న ఆలోచన చేశారు. వారి సంకల్పానికి శుక్రవారం పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల కూడా బాసటగా నిలిచింది. ఆచంట కళాశాలకు భోజనం తెచ్చుకోకుండా వచ్చే విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసేందుకు ఈ ఏడాది జులై నుంచి కళాశాల సిబ్బంది, స్థానికులు చందాలు వేసుకుని ఇప్పటి వరకూ రూ.లక్ష వరకు ఖర్చు చేసినట్లు ప్రిన్సిపల్ ఎన్.శ్రీదేవి తెలిపారు. తాజాగా ఏఎస్ఎన్ఎం కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలిసి రూ.17,600 చెక్కును ఆచంట వచ్చి అందజేశారు. పాలకొల్లు నుంచి ఆచంట వచ్చిన సిబ్బంది శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు.

పోలియో నిర్మూలనపై వక్తృత్వ పోటీలు.. **పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం ఉల్లంపర్రులోని ఓ ప్రైవేటు పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'పోలియో నిర్మూలన' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 15 పాఠశాలల నుంచి 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జివ్వాజి కల్యాణ్, పొతాబత్తులు సత్యనారాయణ, దాశిక శేషగిరిరావు పాల్గొన్నారు.

చిత్రలేఖనం.. **యలమంచిలి, న్యూస్‌టుడే:** యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శుక్రవారం నిర్వహించింది. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో పోటీలు నిర్వహించగా.. అన్ని చోట్ల స్థానిక ప్రధానోపాధ్యాయులు వాటిని ప్రారంభించారు. యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతి, రామేశ్వరపు సత్యనారాయణ, శైలజ, డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు మండల మహాసభలో బహుమతులిస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాల సమావేశంపై చర్చ.. **ఆచంట, న్యూస్‌టుడే:** నవంబరు 2న ఏలూరులో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లాల సమావేశంపై శుక్రవారం ఆచంటలో చర్చించినట్లు ఎమ్మెస్పీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.పెద్దిరాజు వివరించారు. మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా పాల్గొనే సమావేశంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం వెంటనే తీసుకోవాల్సిన నిర్ణయాలపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

దుప్పట్ల పంపిణీ.. **పోడూరు, న్యూస్‌టుడే:** పెన్మత్స సీతమ్మ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన చక్ర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిన్నూరులో శుక్రవారం 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక పెన్మత్స సీతమ్మ స్మారక భవనం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీతమ్మ కుమారులైన గోపాలరాజు, వెంకటపతిరాజు 10 మంది పేదలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. పేద మహిళకు రూ.7 వేల విలువైన కుట్టు మిషన్ అందజేశారు. తొలుత సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు, పాలకొల్లు క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు, కార్యదర్శి సూరిబాబు, చెరుకూరి సత్యనారాయణరాజు, కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని కాపాడాలి.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో కొనసాగించాలని, విద్యా హక్కు చట్టాన్ని కాపాడాలని సీపీఎం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం ఎంఈవోలు డి.శుభాకరరావు పి.రామకృష్ణలకు వినతిపత్రం అందించారు. సీపీఎం గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేయడంతో ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులను గత రెండు సంవత్సరాలుగా ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు. ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, గుర్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు తదితరులు

లారీ నిలిపివేత.. **మార్టేరు, న్యూస్‌టుడే:** రావులపాలెం సమీపంలో ప్రమాదానికి కారణమైన లారీని కొందరు వెంటాడించి పోలీసుల సాయంతో మార్టేరులో పట్టుకున్నారు. మార్గం మధ్యలో అనేక ప్రాంతాల్లో లారీ నిలుపుదలకు ప్రయత్నించిన మద్యం మత్తులో ఉన్న చోదకుడు లారీని వేగంగా నడపడంతో అంతా భయపడ్డారు. వడలిలో వేగాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అప్రమత్తమై మార్టేరు-బ్రాహ్మణచెర్వు రోడ్డులో అడ్డుకున్నారు. సదరు చోదకుడిని వాహనంతో పాటు పోలీసుస్టేషన్‌కు తరలించారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

### ఆధార్ నమోదు కేంద్రం సందర్శన

**నరసాపురం, న్యూస్‌టుడే:** లక్ష్మణేశ్వరం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం డీఎల్‌డీవో ఎం.ప్రభాకరరావు ఎంపీడీవో రామకృష్ణంరాజుతో కలిసి సందర్శించారు. దస్త్రాలు పరిశీలించారు. ఇక్కడకు వచ్చే ప్రజలకు సేవా లోపం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలి.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని దినాలు పెంచాలని, ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో క్షేత్ర సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కొలతలు ప్రకారం మామిడి, కొబ్బరి చెట్లకు పళ్లెలు తవ్వాలని, కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని వివరించారు.

# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## మూడున మహా సభ



గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** నవంబరు మూడున విజయవాడలో నిర్వహించే వక్ఫ్ పరిరక్షణ మహాసభలను విజయవంతం చేయాలని జమాతే ఇస్లామీ హింద్ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మసీదు కూడలిలో మహా సభలకు సంబంధించిన గోడ పత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి కలిగిన వక్ఫ్ బోర్డును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం సరి కాదన్నారు. మొహమ్మద్ రఫీ, సర్దార్ ఖాన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలు లేకుండా చూడాలి



ప్రదర్శనలో వెంకటేశ్వరరావు, సిబ్బంది

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** వారానికి ఒక సారి ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలు తొలగించి దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం 27వ వార్డులో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే పరిశీలించి మాట్లాడారు. ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, వార్డ్ హెల్త్ సెక్రెటరీ వెంకటలక్ష్మి, తాతాజీ, ఆశా కార్యకర్తలు కుమారి పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' భోజనం పరిశీలన

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతా లోపం లేకుండా మధ్యాహ్న భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి ఎంఈవో విశ్వనాథ్ సూచించారు. పెదతాడేపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. పథకం అమలు తీరుపై ఆరా తీశారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**పెంటపాడు, న్యూస్‌టుడే:** పెంటపాడులోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం గ్రామీణ సీఐ రమేశ్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై స్వామి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గంధం వాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్ఫూర్తికి తూట్లు...!

### అన్యాక్రాంతమైన శారదా గ్రంథాలయం

కంచే చేను మేస్తే

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ఆ నాడు చదువుల పరిమళాలు వెదజల్లిన చోటు అది. సాహిత్య చర్చలకు ఆలవాలమైన ప్రదేశమది. సమాజ శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని సాహితీ, సంగీత సేవలు చేయాలనే సదుద్దేశంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి ముందు తాడేపల్లిగూడెం పట్టణ నడిబొడ్డున నిర్మించిన శారదా గ్రంథాలయం నేడు రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతం రూ.కోట్ల విలువ చేస్తుండటంతో ఆక్రమార్కుల కన్ను దానిపై పడింది. అన్యుల చేతుల్లో చిక్కుకుని వాణిజ్య కేంద్రంగా మారింది.

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన దామోజిపురపు నరసమ్మ (జమీందారు) స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త. మహాత్మా గాంధీ అంటే ఆమెకు అమితమైన అభిమానం ఉండేది. నరసమ్మ అభ్యుదయ భావాలకు ఆకర్షితులైన శారదా గ్రంథాలయ నిర్వాహకులు ఆమె సోదరి నారాయణమ్మ ప్రస్తుతం ఎన్టీఆర్ చౌక్ ప్రాంతంలో 250 చదరపు గజాల భూమి బహూకరించారు. సమాజ శ్రేయస్సుకు సంఘాన్ని స్థాపించి 1940 సమయంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలు, నవలలు అందుబాటులో ఉంచేవారు. అంతే కాకుండా మహిళలకు భరతనాట్యం, కూచిపూడి వంటివి నేర్పించేవారు. నరసమ్మ తదనంతరం వరకు గ్రంథాలయంలో సేవా కార్యక్రమాలు నిర్విరామంగా జరిగేవి. ఆ తర్వాత పట్టించుకునేవారు లేకపోవడంతో గ్రంథాలయ ఆస్తులపై అక్రమార్కుల కన్ను పడింది. ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.3 కోట్లకు పైగా ఉండటంతో ఓ వ్యాపారి కాలక్రమేణ ఆక్రమించుకుని భారీ వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టారు.



ఎన్టీఆర్ చౌక్ కూడలి

గత మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎన్నికైన నేతలు శారదా గ్రంథాలయం పరిరక్షిస్తామని చెప్పినవారే. ఓ మాజీ మంత్రి అక్రమార్కులకు అండగా నిలిచారు.

"ఈ నిర్మాణాలకు సంబంధించి గతంలో అనుమతులు మంజూరయ్యాయి. సంస్థ ఆస్తులను మున్సిపాలిటీకి బదలాయించలేదు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తాం." అని కమిషనర్ ఏసుబాబు అన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | :79950 67078 |
| పెంటపాడు | :79939 36123 |
| తణుకు గ్రామీణ | :85558 50851 |
| అత్తిలి | :91548 46774 |

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే**

**సమస్య:** సవిత్యపేటలోని కాల్వకాళ్ల ఆసుపత్రి రోడ్డులో మురుగునీరు రహదారిపైకి చేరుతోంది. - **సుబ్రహ్మణ్యం, స్థానికుడు**

**సమాధానం:** మురుగునీరు తొలగించేలా చర్యలు చేపడతాం. - **సోమేశ్వరరావు, శానిటరి ఇన్‌ఛార్జి**

**సమస్య:** తాడేపల్లిగూడెం పట్టణం మామిడితోట గండిపోచమ్మ సెంటరులో చెత్త పేరుకుని రహదారి పైకి వస్తోంది. - **విజయ్, స్థానికుడు**

**సమాధానం:** చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం - **శ్రీమన్నారాయణ, శానిటరి ఇన్‌స్పెక్టర్.**

**పెంటపాడు, న్యూస్‌టుడే:**

**సమస్య:** పెంటపాడులోని సూర్య ఆంగ్లమాధ్యమ పాఠశాలకు ఎదురుగా రహదారికి ఆనుకుని కొందరు చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - **మహేశ్, స్థానికుడు**

**సమాధానం:** చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం. మురుగు కాలువను బాగు చేయిస్తాం. - **తాడేపల్లి సూర్యకళ, సర్పంచి**

**సమస్య:** పెంటపాడు మండలం ఆకుతీగపాడు ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. - **దావీదు, స్థానికుడు**

**సమాధానం:** మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. - **దాసం వెంకటేశ్వర్లు, సర్పంచి**



రాధాకృష్ణతో వావిలాల తదితరులు

## ఎమ్మెల్యే ఆరిమిల్లి జన్మదిన వేడుకలు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణ, గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన మత పెద్దలు ప్రత్యేక పూజలు, ప్రార్థనలతో రాధాకృష్ణను ఆశీర్వదించారు. పలు గ్రామాల్లో నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పుష్పగుచ్ఛాలు బదులు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. వావిలాల సరళాదేవి చిత్రపటాన్ని (పెయింటింగ్) రాధాకృష్ణకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ★ ఉండ్రాజవరం: పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ వద్ద నివసించే పేదలకు ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కేక్ కోసి పంపిణీ చేశారు.

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పుట్టినరోజు పురస్కరించుకొని శుక్రవారం అత్తిలి మండలంలోని ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు.. పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా మండల అధ్యక్షుడు ఆదినారాయణ, శ్రీనివాసరావు, దయానంద మూర్తి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : బొలిశెట్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

**పెంటపాడు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెంటపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు జరుగుతున్న ప్రగతి పనులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**వచ్చే ఏడాదికి మరో వంద పడకలు.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో వచ్చే ఏడాది మార్చి నాటికి మరో వంద పడకలు అందుబాటులో రానున్నాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021లో రూ.9.45 కోట్ల అంచనా వ్యయంతో నూతన భవన నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.5.41 కోట్ల మేర పనులు పూర్తయినట్లు చెప్పారు. సూపరింటెండెంట్ సూర్యనారాయణ, కమిషనర్ ఏసుబాబు, ఆర్ఎంవో తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## నాగమ్మకు బంగారు ఆభరణాలు



**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** గౌతమీ సాలెంట్ సమీపంలోని శ్రీచక్రసహిత నాగరాజదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ముక్కుపుడక, బొట్టుబిళ్ల బంగారు ఆభరణాలు అందజేశారు. తాడేపల్లిగూడెంకి చెందిన గండం బాబు, సుజాత దంపతులు కుమార్తెలు స్నేహాంజలి, నవీనలు అమ్మవారికి ఆభరణాలతోపాటు చీర, మిరియాలు, పసుపు, కుంకుమ సమర్పించారు.



**అమ్మవార్లకు విశేష పూజలు.. తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పట్టణ పురదేవత బలుసులమ్మ వద్ద శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ★ ఏపీ నిట్ సమీపంలోని కొండాలమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు.

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి రైల్వే స్టేషన్ దారిలో శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గౌరీ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అన్నసమారాధన.. తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పట్టణం 13వ వార్డులోని పెద్ద శివాలయం రోడ్డులో కనకదుర్గ సమేత సుందరేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు.

## మెరిసిన ప్రతిభ

### 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** దువ్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతర్జాలం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. రేష్మంత్, మల్లిక భావన, హేమశ్రీ లక్ష్మి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు బహుమతులు అందజేశారు. జయరాజు, రాధాకృష్ణ, నిర్మల, జయరాజు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని సుబ్బారావుపేట పురపాలకోన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. చరవాణి వినియోగం వల్ల లాభాలున్నాయా? నష్టాలున్నాయా? మీకు ఎదురైన అనుభవాలు అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన తన్మయి సాయి ప్రియ, మహిమ, హేమలకు ప్రధానోపాధ్యాయిని వనజ బహుమతులు అందజేశారు.



తాడేపల్లిగూడెం: విజేతలతో ఉపాధ్యాయులు



దువ్వ: బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

## మైకు మోత.. తీరని వెత



కృష్ణుడి చెరువు



మైకులు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే :** పట్టణంలోని 21వ వార్డులో కృష్ణుడి చెరువు ఒకప్పుడు మురికి కూపంలా ఉండేది. అమృత్ నిధులతో చెరువును పార్కుగా ఆధునికీకరించారు. దాతల సహకారంతో మురళీనాథుని విగ్రహం ఏర్పాటు చేశారు. కొంత మంది కమిటీ సభ్యులుగా ఏర్పడి, నిత్యం పూజలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా....మైకులను ఏర్పాటు చేయడంతో శబ్ద కాలుష్యం ఏర్పడి, ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమయం సందర్భం లేకుండా మోత మోగిస్తున్నారని వాపోతున్నారు మైకు సౌండ్ తగ్గించాలని సూచించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమిషనర్ ఏసుబాబు స్పందిస్తూ... పార్కులో ఏర్పాటు చేసిన మైక్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## సాగునీటి కష్టాలకు చెల్లు

**పెంటపాడు, న్యూస్‌టుడే :** సాగునీటి పంపిణీలో కీలకమైన సాగు నీటి సంఘాలు వైకాపా పాలనలో ఉనికి కోల్పోయాయి. వర్షాభావం సందర్భాల్లో శివారు భూములకు సాగునీటి ఇబ్బందులు ఎదురు కాకుండా సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ద్వారా చర్యలు చేపట్టేవి. గత అయిదేళ్లలో వీటిని పట్టించుకున్న వారు లేకుండా పోయారు. ప్రస్తుతం ఎన్డీయే సర్కారు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నిర్ణయం తీసుకోవడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ★ పెంటపాడు జలవనరుల శాఖ పరిధిలో సుమారు 35 వేల ఎకరాలు సాగవుతోంది. ప్రధానంగా మిడ్‌లెవల్, లోలెవల్, వెంకయ్యావయ్యేరు కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. వాటి పరిధిలోని ముద్దాపురం, రాచర్ల, రావిపాడు, పెంటపాడు, బొమ్మిడి పరిధిలోని ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



మిడ్ లెవల్ కాలువ

"నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. పెంటపాడు జలవనరుల శాఖ పరిధిలో నిర్దేశించిన ఏడు నీటి సంఘాల పరిధిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. " అని ఏఈ కిరణ్‌కుమార్ అన్నారు.

## ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాజగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. అనంతరం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాంప్రసాద్, అంజిబాబు, సుబ్బారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పట్టింపులేని పారిశుద్ధ్యం



**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ ప్రహసనంగా మారింది. ఇళ్లల్లోని వ్యర్థాలు రోడ్లపై దర్శనమిస్తున్నాయి. సుబ్బారావుపేట రామాలయం పక్క వీధిలో రోడ్డుపై చెత్త మేట వేసింది. దీనిపై కమిషనర్ ఏసుబాబు స్పందిస్తూ చెత్త తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

## గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి



ఉనికిలి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వంశీ

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి మండలంలో నిర్వహిస్తున్న గ్రామ సభలను భూ సమస్యల పరిష్కారానికి సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ సూచించారు. శుక్రవారం ఉనికిలి గ్రామ సభలో భూ సమస్యల పరిష్కారానికి 40 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మానవత' ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలిలో విద్యుదాఘాతంతో ఇటీవల తాటాకిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబానికి అత్తిలి మానవత మండల శాఖ రూ.పదివేలు ఆర్థిక సాయం అందించింది.

## వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ జీవ వైవిధ్యం ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఫణిధర్, చాముండేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరంపై దాడి

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** కంసాలిగుంటలో నిర్వహించిన కోడి పందేలపై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కోడిపుంజులు, 2 కత్తులు, 12 ద్విచక్ర వాహనాలతో పాటు రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## యువకుడి ఆత్మహత్య

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలు... ఇదే గ్రామానికి చెందిన మందపల్లి సాయి కుమార్ (20)కు ఇటీవల వివాహమైంది. ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## 25 నుంచి పశుగణన

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించి స్థానిక ఎన్డీయే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంటింటికీ సిబ్బంది వచ్చి, పశుగణన చేపడతారని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు మాట్లాడుతూ 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తణుకు, అత్తిలి మండలాలు పశు సంవర్ధక శాఖా అధికారులు పాల్గొన్నారు.



## ఆవాసం.. అవస్థలే ఆసాంతం

"నిత్యం పాముల సంచారం ఎక్కువైంది. బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నాం. రహదారిలేక పోవడంతో పురపాలక ట్యాంకు నీరు రావడం లేదు" అని హేమలత ఆవేదన వ్యక్తం చేశారు.




" నివాసాల వద్ద సెప్టిక్ ట్యాంకు నీరు లీకై దుర్వాసన వస్తోంది. నివాసాల మధ్య మురుగుచేరి దోమలు విజృంభిస్తున్నాయి" అని రాఘవులు వాపోయారు.'





లీకవుతున్న సెప్టిక్ పైపులు



శిథిలావస్థకు చేరిన నివాస సముదాయం

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పట్టణానికి దూరంగా ఉన్న ఎల్.అగ్రహారం పరిధిలో 2004లో రాజీవ్‌గృహకల్పనలో భాగంగా ఆరు బ్లాకుల్లో 256 నివాసాలు నిర్మించారు. ప్రారంభంలో బాగున్నా నిర్వహణ లోపంతో గృహాలు శిథిలావస్థకు చేరాయి. మురుగు కదలక స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. పురపాలక ట్యాంకు నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. నివాసాల ప్రాంగణాల్లో విషపురుగుల సంచారం ఎక్కువైంది.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం." అని కమిషనర్ ఏసుబాబు అన్నారు.